# హత్య

సత్యనారాయణ గట్టిగా అరిచాడు. పైన పెంకులు ఎగిరిపోయేటట్టు, సుబ్బారావు బుంగమూతిపెట్టి బోర్లా పడుకున్నాడు. "మా నాన్నగారు రాసినట్టుగా నిన్ను ఊరికి పంపేస్తే ఎంతో బాగుండేది, నువ్వు నాపరువు తీసేస్తున్నావు నా మర్యాదను హత్యచేసేస్తున్నావు" గోలపెట్టాడు సత్యనారాయణ. ఆగదిలో ఇంక యెవరూ లేకపోవటంవల్ల ఉన్న ఆ ఒక్క సుబ్బారావు కార్యవాదేగాని మాటకుమాట చెప్పే వరకు కాకపోవటంవల్ల సత్యనారాయణ శ్రమంతా వృధా అయింది.

అరిచి అరిచి అలిసిపోయాడు సత్యనారాయణ.

"నీ పథకం ఇదన్నమాట. నన్ను ఏరకంగా టోపీ వేశావు?" అని కాస్సేపు ఆశ్చర్యపడి చివరికి చేసేదిలేక ఆ ఫైళ్ళు రెండూ ముందు వేసుకుని కూర్చున్నాడు సత్యనారాయణ.

ఆ పైళ్ళతాలూకు 'సృష్టికర్త' అయిన సుబ్బారావు అప్పటికే గుర్రుపట్టి నిద్రపోతున్నాడు.

సత్యనారాయణ ఆఊళ్ళోవున్న ఒకానొక ఆఫీసులో ఉద్యోగం చేసుకుంటూన్న యువకుడు. అయినవారిలోనూ కానివారిలోనూ పెద్దమనిషిగా పరిగణించబడినవాడు అతడు, అట్టే వయస్సు లేకపోయినా.

సుబ్బారావు స్కూలుఫైనలు పాసవగానే విశ్వనాథంగారికి ఒకేఒకచింత పట్టుకుంది. కుర్రవాడిని పైచదువులు చదివించాలని ఇంట్లో అందరికీ ఆశగావుంది. హాస్టల్లో పెడితే చిల్లరస్నేహాలుచేసి, అల్లరిగా తిరుగుతాడేమోనని అనుమానంగా ఉంది. అందుచేత ఆ విషయాన్ని గురించి చాలా రోజులు మథనపడి నలుగుర్ని విచారించారు విశ్వనాథంగారు, ఎక్కడవుంచి చదివించడమా అని.

ఆ సమయంలోనే ఆయనకు దూరపుబంధువు అయిన సత్యనారాయణను గురించి తెలిసింది. అతనిని గురించి విశ్వనాథంగారికి అదివరకే తెలుసు. ఇటీవల అతనికివచ్చిన ప్రమోషన్ గురించీ విన్నారు, అందుచేతే తిన్నగా సత్యనారాయణనే కదిపారు.

తీసుకున్న రెండు గదులూ ఇంకొకమనిషి ఉండటానికి ఏమాత్రము అసౌకర్యంగా ఉండవు" కాస్త సందడిగానూ ఉంటుంది. పైగా విశ్వనాథంగారి అంతటి మనిషి వచ్చి అడి

గారు, కనక సుబ్బారావు తనతో ఉండటానికి వెంటనే సమ్మతి తెలపడానికి సత్యనారాయణకి ఏ సంకోచము కలగలేదు.

సుబ్బారావుకు అంతా బాగానే ఉందిగాని ఒక విషయంమాత్రం తలకొట్టేసినట్టయింది. సత్యనారాయణ తన కంటె మహా అయితే నాలుగయిదేళ్ళు పెద్దవాడు కావచ్చు. అంతమాత్రానికి అతన్ని సంరక్షకుడిగా నియమించి, తను అతనుచెప్పినట్టు 'తూచా' తప్పకుండా నడుచుకోవాలని శాసించడము, తనను యేమీ తెలియని అర్భకుడిగా జమకట్టి, సత్యనారాయణను తన భావాలకు, తన అలవాట్లకు, తన కదలికలకు శాసనకర్తగా నియమించడము ఎంతమాత్రము సబబుగా కనిపించలేదు.

అయితే, ఇదంతా చేసింది తనతండ్రి విశ్వనాథంగారే అవటంవల్ల, ఆయనంటే తనకు భయం ఉండటంవల్ల పైకి ఏమీ అనలేకపోయాడు. పైగా సత్యనారాయణకూడా మంచి వాడులాగ కనబడుతున్నాడు అని సరిపెట్టుకోవలసివచ్చింది సుబ్బారావు.

సత్యనారాణ ఆఫీసు పదిన్నరగంటలకు. సుబ్బారావు కాలేజీ అప్పుడే తెరుస్తారు. ఇద్దరూ పదింటికల్లా అన్నీ ముగించుకొని కేకినీమహాల్లో భోజనం కానిచ్చి ఎవరితోవన వాళ్ళు పోయేవారు. సత్యనారాయణ పనులన్నీ చూసుకుని రాత్రి ఏడున్నరకు తిరిగివచ్చేవాడు. కాలేజీకి దగ్గిరే అవటం వల్ల సుబ్బారావు క్లాసులు లేనప్పుడు గదిలోనే కూర్చుని శ్రద్ధగా చదువుకునేవాడు. సాయంత్రవేళల్లో ఓ అరగంటసేపు మేడమీద చల్లగాలి పీల్చుకోవటంకూడా అలవాటు వున్నది.

రాత్రి ఎనిమిదిన్నరకు భోజనము, పదకొండు గంటల దాకా చదువు, తరవాతనిద్ర ఇదీ సుబ్బారావు కార్యక్రమం. సత్యనారాయణ ఖాళీగాఉన్నప్పుడల్లా, తెలియనివి అడిగి చెప్పించుకోవటమూ కద్దు. వీలయితే వారానికొకసారి సినిమాకు వెళ్ళేవారు ఇద్దరూ. ఇవన్నీ మంచివిద్యార్థి లక్షణాలు కావని ఎవరనగలరు ?

పుట్టిపెరిగి ఇన్నాళ్ళూ మసలిన ఊరును, తల్లిదండ్రుల్నీ వదిలి వచ్చేటప్పుడు యేదో బాధ అనిపించినా సుబ్బారావుకు ఈ వాతావరణం బాగానేవుంది. కాలేజీ, అన్ని సౌకర్యాలూ అందుబాటులోవున్న పట్టణవాతావరణం అన్నిటినీమించి విశ్వనాథంగారు దగ్గిర లేకపోవడము సుబ్బారావుకు బాగా నచ్చాయి.

'సుబ్బారావు తెలివిగలవాడు' అనే అభిప్రాయం సత్యనారాయణలోనూ యేర్పడింది. అందుకనే ఇద్దరూ 'ఏమండీ'తో ప్రారంభించి, 'ఏమయ్యా'లోకిదిగి, 'ఏమోయ్' దాటి. ఆఖరికి 'ఏరా'లోకి ప్రవేశించారు. రెండేళ్ళయినా గడవకముందే

ఎప్పుడయినా సెలవుల్లో స్వగ్రామం వెళ్ళినా వారం రోజులకంటె ఎక్కువ ఉండలేకపోయేవాడు సుబ్బారావు. ఏదో సాకు చూపించి మళ్ళీ పరుగెత్తుకు వచ్చేదాకా అతనికి వూపిరాడనట్టు ఉండేది. ఏమీ తోచేదిగాదు.

ఆ యేడు మార్చి అయిపోయి యేప్రిలు వచ్చేసింది.

పరీక్షలయిపోగానే సుబ్బారావును పంపించవలసిందని ఉత్తరం వ్రాశారు సత్యనారాయణకు విశ్వనాథంగారు. ఆ ఉత్తరం చూసి చల్లబడి నీరుకారిపోయారు సుబ్బారావు. ఆ పల్లెటూరి వాతావరణం జ్ఞాపకంవచ్చి బాధపడ్డాడు: పైగా ఈ నెలలోనే టౌనుకు యేదో పెద్దసర్కస్ వస్తూందని అనుకుంటున్నారు. ఆ పల్లెటూళ్ళో తను ఒక్కడికీ యేమీ తోచక పోవటం, తనపెళ్ళినిగురించి నలుగురూ అనుకోవటం, తండ్రి పరిశీలనా దృక్కులూ - ఇవన్నీ జ్ఞాపకంవచ్చి సుబ్బారావు బాధపడ్డాడు. సవిస్తరంగా యివన్నీ యేకరువుపెట్టి, తండ్రికి యేదో వ్రాసి తనను స్వేచ్ఛావాయువులు పీల్చుకోవటానికి అనుమతించవలసిందిగా దీనంగా ప్రార్థించిన సుబ్బారావుమీద సత్యనారాయణకు జాలి వేసింది.

అతనూ కుర్రవాడేననుక సుబ్బారావు పడుతున్న బాధ అతనికి అర్థమయింది. సుబ్బారావుతో ఆలోచించి ఒకపథకం తయారు చేశాడు అతని సమ్మతిమీద.

వెంటనే సుబ్బారావుకు ట్యూషను ఏర్పాటుచేశాడు. దానిప్రకారం రోజూ ప్రొద్దున రెండుగంటలసేపు సుబ్బారావు ఫిజిక్సు లెక్చరర్‌గారివద్ద లెక్కలూ, కెమిస్ట్రీ, ఫిజిక్సూ—ఈ మూడు విషయాలతోనూ ప్రైవేటు చెప్పించుకోవాలి.

ఆ మరునాడే సత్యనారాయణ విశ్వనాథంగారికి యిలాగ ఉత్తరం వ్రాసిపడేశాడు: "సుబ్బారావుకు పరీక్షలయినవి. బాగా వ్రాశాడు. ఈ సెలవులలో సుబ్బారావు

కాలం వృథా పుచ్చటంకంటె ట్యూషను చెప్పించుకోవటం ఉత్తమమని నాకు తెలిసిన లెక్చరరుగారు అన్నారు. ట్యూషనుకి వందరూపాయలవుతుందట.

ఆ ప్రకారమే చేయటం మంచిదని అనుకుంటున్నాను. ఈ క్లాసులో బాగా, మంచిమార్కులతో మనవాడు పాసయినట్టయితే అతనికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

కనక సుబ్బారావు ఇక్కడే ఉండి చదువుకుంటే బాగా ఉంటుంది. ఈ విషయంలో మీ అభిప్రాయం తెలియపరిచేది..."

పదిరోజుల్లో జవాబు వచ్చింది — "నీ అభిప్రాయం బాగానే వుంది. అట్లాగే చెయ్యవలసింది" అని.

సుబ్బారావు సత్యనారాయణను నెత్తిమీద పెట్టుకున్నాడు. రోజూ బుద్ధిగా ట్యూషనుకు వెళ్ళివస్తున్నాడు. అంతా బాగానే ఉందిగదా అనుకుని సంతృప్తిపడ్డాడు సత్యనారాయణ.

కాని ఆనాడు సత్యనారాయణ గదికి వచ్చేసరికి సుబ్బారావు దీర్ఘంగా ఆలోచిస్తూ తనలో తనే యేదో మధనపడుతూ కనిపించాడు. ఒక అరగంట బాధపడి, ఇక ఆగలేక సత్యనారాయణకు విషయం అంతా క్లుప్తంగా వివరించేడు. "వ్యవహారమంతా యీ ఫైళ్ళలోవుంది. నీటముంచుతావో, పాలముంచుతావో అంతా నీ చేతుల్లోనేవుంది. సత్యనారాయణా, ఆపద్బాంధవా!" అంటూ కాళ్ళు పట్టుకున్నాడు.

సత్యనారాయణలో కోపం ఉవ్వెత్తున పొంగివచ్చింది.

ఉండి ఉండి ముంచుకొనివచ్చిన ఉపద్రవంలాగు. దాని ధాటికి ఆగలేక సుబ్బారావు మంచాన్ని ఆశ్రయించి, "త్వమేవ శరణం" అన్నాడు.

'ఈ కథా ప్రారంభంలో వివరించినట్టుగా చేసేదేమీ లేక చివరికి సత్యనారాయణ ఆ రెండు ఫైళ్ళూ ముందేసుకుని కూర్చున్నాడు.

అందులో ఒక ఫైలు పెద్దది. రెండవది చిన్నది.

పెద్దఫైలు చాలా అందయిన అట్టలో పెట్టబడిఉన్నది. ఆ అట్టమీద చక్కని డిజైను, మధ్యలో ఆకుతెలుపు, పసుపు రంగుల్లో వసంతుని వర్ణచిత్రం.

ముందున్నది ఉపోద్ఘాతం ముచ్చటగా మూడుపేజీలు. ముక్తసరిగా దాని సారాంశం యిది: "వయస్సు అందమయినది. దానితో వచ్చు వూహాలుకూడా మనోహరమయినవి. అవి కొందరికి నచ్చకపోవచ్చు. కాని అవి రాక మానవు. అబ్బాయిల్నీ అమ్మాయిల్నీ కలవర పెట్టక మానవు. ఈ కలవరపాటును సత్యనారాయణలాటివాళ్ళు అణిచిపెట్టి నిలదొక్కుకొనగలిగి వుండవచ్చు. కాని సుబ్బారావులాంటివాళ్ళు నిభాయించుకుని నిలబడ లేకపోతే అది వాళ్ళ తప్పుకాదు.

కనక ఈ ఫైలులో సుబ్బారావు చేసింది ఏమయినా పొరపాటని యెవరయినా అనుకుంటే ఆ తప్పు అతనిది కాదు.

తొందరపడి, చనువు గలవాళ్ళు సుబ్బారావును నాలుగు తిట్టినా, తరవాత పశ్చాత్తాపపడక మానరు. కాస్త

నిదానంగా ఆలోచించి చూస్తే యిందులో అతనితప్పు యే మాత్రమూ కనబడదు ఎవరికీ.

అసలు ఈ ఫైలు సుబ్బారావుకు సంబంధించింది కాదు. లలితది అంతా చదివిన తరవాత సత్యనారాయణ లాంటివాళ్లు మెదలకుండా పూరుక్కోవడంకంటె కాస్త సాను భూతి చూపి, కావలసిన కార్యము కావాలంటే కళ్యాణము, పెద్దలచేత జరిపించటం మంచిది.

"ఇక నాలుగవ పేజీకి తిప్పవచ్చును."

సత్యనారాయణ పేజీ తిరగవేశాడు. నాలుగవ పేజీ మొదలుపెట్టేడు. "యౌవనం కళ్లు మూసుకున్న కలవమొగ్గ లాంటిది. అది యెప్పుడు రేకు తొడుగుతుందో అసలే చెప్ప లేము—అనిపించింది సుబ్బారావుకు. కారణం?

ఆ సాయంత్రం గాలి పీల్చుకుంటున్న సుబ్బారావు యెదురింటి మేడపైన హఠాత్తుగా మెరుపులా కనబడి మాయ మయిన చిన్నారినిచూశాడు. ఆ అమ్మాయిని ఇంకా కాస్సేపు చూద్దామనిపించింది.

మీనుల్లాటి కళ్ళమధ్యనుంచి పాకి కిందికి దిగివచ్చిన సంపెంగ పూవువంటినాసిక ముద్దుపెట్టుకుంటానన్నట్టు భావించి విల్లులా పైకి వంపుతిరిగిన పైపెదిమ దానిని తీసి వారేసి అందంగా మిడిసిపడుతున్న కిందిపెదిమ ఇంకా కాసేపు చూద్దామనుకున్నాడు.

కాని ఆ హేమకుసుమసుందరికి ఆనాడు అంతా నిరీ క్షించినా తిరిగి కాంచలేకపోయాడు. కాని ఆ బంగారుతీగ

పోతూపోతూ, కనుచివరలనుంచి విసిరిన చూపు అతని గుండె లలో నాటుకుపోయింది. ప్రథమ వీక్షణంలోనే అతని గుండె ఎగిరిపోయింది.

అతినియౌవనం. ఒక రేకు తొడిగింది మనస్సనే పూవుకు. మరునాడు సుబ్బారావు గాలిపీల్చుకోటానికి వెళ్ళే ప్పటికి ఆ అమ్మాయి మేడమీద కూర్చుని పుస్తకం చదువు కుంటున్నది,

తీయని మిఠాయి తిన్నట్లూ, వెన్నెలలో స్నానం చేసినట్లూ ఆనందపడ్డాడు సుబ్బారావు. ఒక అందమయిన గేయనాటిక వ్రాద్దామని ఉత్సాహం కలిగింది. కాగితం కలం తీసుకుని వ్రాయటం మొదలెట్టాడు.

గేయనాటిక మధ్యలో ఆగిపోయింది. మనస్సు ఆ అమ్మాయివైపు తిరిగి ఉత్సాహం ఆవిరయిపోయింది. దొంగ చూపులుచూస్తున్న సుబ్బారావు. మధ్యమధ్య ఆ అమ్మాయి కూడా తనవంకచూడడం చూసి పన్నీరు చల్లినంత ఆనందం అనుభవించాడు.

కొన్నిరోజులు అలా గడిచిపోయాయి.

ఆ అమ్మాయి విసిరిన చూపుల తూపులకు సుబ్బా రావు మనస్సుకు తొడిగినరేకు బలపడి రంగుపులుముకుంది. వెనకాడుతున్న హృదయాన్ని దిటవు పరచుకొని ధైర్యంగా ఒకఅడుగు ముందుకు వేశాడు. ప్రేమజీవులకు అన్నీ విషమ పరీక్షలేగదా! అసలు ప్రేమాయణంలోనే అడుగడుగునా ఆశ్చర్యాలామె.

ఒకనాడు ఆ అమ్మాయిచూస్తూఉండగా అతను వణకుతున్న చేతులతో ఒక చీటీవ్రాసి, చిన్నరాతికి చుట్టి ఆమేడ మీదికి విసిరేశాడు. కాస్సేపటికి ఆ అమ్మాయి లేచివెళ్ళి ఆ చీటీవిప్పి చదువుకోవటం గమనించి అతను సిగ్గుపడ్డాడు.

'అందమయిన అమ్మాయీ! మీపేరు నాకు తెలియదు. లలితమనోజ్ఞమయిన మీ అందం "లలిత" అని మిమ్మల్ని పిలవమంటున్నది.

మీతో స్నేహం చెయ్యాలని నా మనస్సు కోరుతున్నది. అయితే అందుకు మీరు ఒప్పుకోవాలిగదా! ఇన్నాళ్ళనుంచీ చూపులతో మనం పరిచితులమే. అయితే మీనుంచి ఈ ఉత్తరానికి సమాధానం కావాలని నేనాశించటం అత్యాశకాదనలేను.

కానయితే నాస్నేహాన్ని మీరు అమోదించేపక్షంలో దాన్ని మీరు ఒకవిధంగా సూచించవచ్చును. రేపు మీరు జడలో ఒకే ఒక్క గులాబీని తురుముకొని నాకు కనబడితే మనస్నేహాన్ని మీరు ఆమోదించినట్లు భావిస్తాను.

మనస్నేహం శరజ్జ్యోత్స్నలాగు ఆనందప్రదం కావాలని ఆశిస్తున్నాను.

ఇట్లు,

........ ...

ఆ ఉత్తరం చదువుకున్న ఆ అమ్మాయిమొహం ఎర్రబడింది. చేతిలో ఉత్తరాన్ని నలిపి ఉండగా పట్టుకొని లోనికి పరుగెత్తింది' అదిచూసిన సుబ్బారావుకు అనుమానంవచ్చి

గుండెల్లో రైళ్లు తిరిగాయి. గదికి తాళంవేసి కంగారున బజారునపడ్డాడు సుబ్బారావు. ఎవరో తనను వెంటాడుతున్నట్టు ఊరంతా తిరిగి రాత్రి ఎనిమిదింటికి గదిచేరాడు. సుబ్బారావుమీద యేమాత్రము అనుమానంవున్నా, ఆవిషయం పసిగట్టటం సత్యనారాయణకు పెద్ద కష్టమయేదికాదు. అసలు అనుమానమనేది లేకపోవటంవల్ల ఆసంగతి అతను గమనించలేదు. ఆరాత్రిల్లా యెవరయినావచ్చి బెదిరిస్తారేమోనని కంగారుపడ్డాడు సుబ్బారావు. కలతనిద్రలో రాత్రి గడిచిపోయింది ఎలాంటిబెడదా లేకుండానే.

మరునాటి సాయంత్రం జడలో ఒకే గులాబీని తురుముకుని నవ్వుతూ కనబడింది ఆ అమ్మాయి. సుబ్బారావు బ్రహ్మానందభరితుడే అయ్యాడు. ఆనాటినుంచీ నవ్వులపువ్వులతో అభిషేకం చేసుకునేవారు ఇద్దరూ ఒకరినొకరు. తొలిప్రేమకు ఇటువంటి ముగింపు దొరకడం అబ్బురమేగదా! అవసరమనిపించినప్పుడు రాళ్ళతో ఉత్తరాలు పంపిస్తూ ఉండేవాడు సుబ్బారావు. అవన్నీ అందుకునేది ఆ అమ్మాయి. జవాబులు వ్రాయకపోయినా.

ఇలా కొన్నిరోజులయినాక బలపడి రంగు పులుముకున్న రేక విచ్చుకున్నది. విరహము ఎల్లెడలా వ్యాపించి రాజ్యం చెయ్యటం మొదలెట్టింది. 'ఈబాధ దుర్లభము. యెడబాటు సైపలేను' అని బాధపడ్డాడు సుబ్బారావు. అతనిబాధ గ్రహించినట్టుగా ఆమె జాలిగాచూసేది అతనివైపు.

సుబ్బారావుకు అబద్ధం ఆడటంకంటె, మాట్లాడకుండా ఊరుకోవటం ఇష్టమని అతన్ని యెరిగున్న వాళ్ళందరికీ తెలుసును. కనక చిన్నదీ చిన్నవాడూ ఒకరినొకరుచూసి ఇష్టపడినట్లుసునిదితమేగదా! సత్యనారాయణకూడా ఒప్పుకోకతప్పదు.

కనక సత్యనారాయణా! ఈ ఫైలును చూసినట్లు సంతకంపెట్టి ఇక నువ్వు రెండవఫైలును చూస్తానంటే అందుకు అభ్యంతరం యేమాత్రమూ లేదు."

సత్యనారాయణ రెండవఫైలు తీశాడు. దాని అట్ట చిరిగిపోయివున్నది. అందులోఉన్నవి చాలా తక్కువపేజీలు. సత్యనారాయణ చదివాడు. దాని సంగ్రహసారాంశం ఇది:

"సుబ్బారావు అంతటితో ఊరుకోనలేదు: ఎట్టికార్యమయినా నెరవేరవలెనంటే కృషి అవసరంకదా! చాలా రోజులు శ్రమపడి సుబ్బారావు ఈక్రింది విలువయిన సమాచారం సేకరించాడు. అదే ఈ రెండవ ఫైలులోని విషయం.

ఆ అమ్మాయికి తండ్రిమాత్రమే కలడు. తల్లి చిన్నతనంలోనే పోయింది. అందరికంటె చిన్నది ఈ చిన్నారి. ఇంకా వివాహం కాలేదు. మంచి స్థితిపరులే. మిగతా అందరికి వివాహమయి యెవరికివారు విడిపోయారు.

మదరాసులో ఈ బాలిక స్కూలుఫైనలు వరకు మాత్రమే చదివి అంతటితో ఆపివేసిందట!

ఈ ఫైలులో అన్నిటికంటె ముఖ్యంగా గమనించవలసినది ఈక్రింది పేరాగ్రాపు.

ఆమెతండ్రి రాజగోపాలంగారు మంచి మర్యాదాగల

వంశంనుంచి వచ్చినవాడు. సాంప్రదాయికమయిన కుటుంబ వారిది. తదితర వివరాలన్నీ 'రికార్డు' చేసి ఈ విషయం ఏకాగ్రతతో సుబ్బారావు పరిశీలించాడు. అందుమీదట అతడు ఈ నిర్ణయానికి వచ్చాడు సుబ్బారావు ఈ అమ్మాయిని చేసుకుని ఒక ఇంటివాడవటానికి అతని తల్లిదండ్రులకు ఉండగల ఎలాంటి అభ్యంతరమూ కాగడాపెట్టి వెదికినా అతనికి కనిపించటంలేదు. ఇదేవిషయం యెవరికయినా అన్వయించవచ్చును."

రెండవ పైలూ అయిపోయింది. మిగతా చేతంతా తీస్తే సారాంశం యిదన్నమాట. ఆఖరికి ఆఫీసునోటులో ఇలా ఉంది.

"ఒకేయ్ ! సత్యనారాయణా ! నువ్వు అప్పుడప్పుడు ఇంటికి తెచ్చే ఆఫీసుపైళ్ళుచూసి ఆఫీసులో పైళ్ళు ఎలా నడిచేదీ కొంచెం ఆకళింపు చేసుకున్నాను. ఆ విజ్ఞానం ఉపయోగించే ఈ కేసు ఈ రెండుపైళ్ళ రూపంలోనూ నీముందు ఉంచాను.

ఈ కేసు యింతవరకూ చదివాక యేం చెయ్యాలో చెప్పమని నీలాటివాడు అడగటం అంత సమంజసం కాదనుకుంటాను. అయినా సరే, ఇది స్వవిషయంగనక — అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు చెబుతున్నాను నువ్వు చెయ్యవలసిన పనిని గురించి.

విశ్వనాథంగారి దగ్గిర నీకుఉన్న పరపతికీ— సుబ్బారావుకు ఉన్న పరపతికీ యెంతో తేడా ఉన్నది. పైగా అది

అతని స్వవిషయం. ఎలా వివరించగలడు? పైగా ఈ కేసులో అంతా సవ్యంగా ఉన్నదిగనక నువ్వు చెయ్యవలసినపనిచాలా సులభసాధ్యమయినది. నీ బుద్ధి ఉపయోగించి, ఏదో విధంగా విశ్వనాథంగారూ, రాజగోపాలం గారూ ఒకదోవకు వచ్చి, ఆ యిద్దరు ప్రేమికుల వివాహమూ అయిందీ అనిపించేటట్లు చెయ్యటమే తరవాయి!

మామయ్య నీకు బాగా తెలుసును. అతని పలుకుబడి నీకు ఎరుకే.

కనక, నువ్వే 'కేసు వర్కరు' వనుకుని, నీ నేర్పు ఉపయోగించి దీనికి నివేదిక తయారుచెయ్యి. నేర్పుగా యీ కేసు గెలిపిస్తే నీ నోట్లో పంచదార."

బుగ్గమీద చెయ్యిపెట్టుకుని ఆలోచిస్తున్న సత్యనారాయణ "ఏరోయ్! అయిందా?" అన్న ప్రశ్న విని పక్కకు తిరిగి చూశాడు.

నిద్రనుంచి లేచి యెంతసేపటినుంచి చూస్తున్నాడో సుబ్బారావు యెర్రబడిన కళ్ళలోనుంచి నవ్వుతున్నాడు. సత్యనారాయణకు జాలివేసింది.

త్వరగా ఫైళ్ళమీద యేదో వ్రాసి సంతకం పెట్టాడు ఇద్దరూ నవ్వుకున్నారు. ఆ మరునాటిరాత్రి సత్యనారాయణను బెజవాడపోయే రైలెక్కించి సుబ్బారావు ఆనంద కందళిత హృదయుడై తిరిగివచ్చాడు. ఆ మరునాడే ఆ విషయం రాతి ఉత్తరం ద్వారా యెదురింటి మేడమీదికి చేరిపోయింది.

పదిరోజులు అయిన తరవాత, సుబ్బారావు మామయ్య చలపతిరావుగారితోనూ, విశ్వనాథంగారితోనూ మాట్లాడి వెళ్ళిన పనిని ఒక దారిలోపెట్టి బ్రహ్మాండమయిన స్వాగతం లభిస్తుందేమోనని ఆశిస్తూ గదిముందు రిక్షాదిగిన సత్యనారాయణ ఆశించిందేమో అవకపోయేసరికి కాస్త తడబడిన మాట నిజమే.

తలుపు తెరుచుకుని గదిలోనికి సత్యనారాయణ వచ్చేసరికి పైకిచూస్తున్నాడు. నిర్జీవంగా. ఈ హఠాత్పరిణామానికి కొంచెం భయపడినా, గట్టివాడుగనక నిభాయించుకుని తను నిర్వర్తించుకుని వచ్చిన కార్యాన్ని గురించి క్లుప్తంగా వివరించి, సుబ్బారావును యిటువంటి పరిస్థితిలో ఉండటానికి గల కారణమేమిటని అడిగాడు. అతనికి అందచెయ్యబడిన సమాచారం ఇది.

ఆనాడు సత్యనారాయణను రైలెక్కించి వచ్చిన సుబ్బారావు బాగానేవున్నాడు. ఆ మరునాడు తన ప్రేయసికి ఉత్తరమూ పంపించాడు. అంతే! అదేఆఖరుసారి తను ఆమెను చూడటం.

ఆ తరవాత నాలుగు రోజులు వరసగా ఆమె కోసం ఆశతో నిరీక్షించాడు. కాని ఆ అమ్మాయిజాడ తెలియలేదు. కాలు కాలిన పిల్లిలా వూరంతా తెగ తిరిగాడు. కాని ఆ యింటి లోపలికి వెళ్ళి వివరించేచనువు తీసుకోలేక పోయాడు.

ఆ నాలుగు రోజులు అతనికి తిండి సయించలేదు. రాత్రులు నిద్రలేకుండా గడిపాడు. ఆ యింటికి ఎవరో కొత్త వాళ్లు రావటం అతను గమనించాడు. ఎన్నడూ యిదివరకు కనిపించనివాళ్లు చాలామంది ఆ యింట్లో తిరుగుతూ ఉన్నారు అయితే ఆమె మాత్రం కనిపించలేదు.

వారం రోజుల తరవాత ఒకనాటి మధ్యాహ్నము సుబ్బారావు యేదో చదువుకుంటూ వుండగా, దగ్గిరవేసి ఉన్న తలుపుతోసి ఒక అపరిచితవ్యక్తి లోపల ప్రవేశించాడు, "క్షమించాల నన్ను" అంటూ. సుబ్బారావు ఆయన్ను ఆహ్వానించి కూర్చుండబెట్టాడు. పరస్పర పరిచయాలయాక కాస్సేపు అవీ యివీ మాట్లాడుకున్నారు. సాధారణ విషయాలు. ఆయనపేరు ఆంజనేయులు. నల్లగా కుదమట్టమయిన ఆకారం. లావుపాటి ముక్కూ, మాట్లాడేటప్పుడు బయటికి పొడుచుకొని వచ్చే పళ్ళూ, నవ్వేటప్పుడు ఊగే బుగ్గలూను. ముళ్ళపంది వెంట్రుకలవంటిజుట్టుచివరలు మొహంమీదికి వంగి మూరులాగు వున్నాయి.

"సుబ్బారావుగారూ! నేను పెద్దగా చదువుకున్నవాణ్ణి కాను. మీ యెదురింటి మేడమీది రాజగోపాలంగారు నాకు మేనమామ అవుతారు. చిన్నప్పటినుంచీ నేనూ లలితా భార్యాభర్తలమని అంటూ యేడిపించేవారు. నేను లలితని ప్రేమించాను. కాని నన్నుచూసి యే స్త్రీ కూడా మనస్ఫూర్తిగా ప్రేమిస్తుందని అనుకోవటానికి నాకు సాహసం చాలదు.

"అయితే ఒకటి మాత్రం నిజం. లలితంటే నాకు చాలా యిష్టం ఆ అమ్మాయి ఇంకొకరి భార్య అయితే నేను యెంతో బాధపడటం మాత్రం ఖాయం. అయితే ఆమె మా మామయ్యకి గారాల బాలిక. ఆమె యిష్టానికి వ్యతిరేకంగా ఆయన ఏ పనీ చెయ్యడు..."

సుబ్బారావు మొహం చిట్లించాడు. ఆంజనేయులు నవ్వి అన్నాడు; "మీరు చిరాకు పడతారని నాకు తెలుసు. అయితే మీతో ఒక ముఖ్యమయిన పని ఉండి వచ్చాను. వారం రోజుల క్రితం లలితకి మశూచి వచ్చింది. ఒళ్ళంతా భయంకరమయిన మచ్చలు. మనిషి రూపు మారిపోయింది. నేనూ, మా అమ్మ దగ్గరఉండి అన్నీ చూశాము. పాపం, మామయ్య చాలా ఇబ్బంది పడిపోయాడు.

"డాక్టరు వ్యాధిని పోగొట్ట గలిగాడుగాని మచ్చలు తీసివెయ్యలేకపోయాడు. లలిత యిప్పుడు తేరుకుని బాగానే ఉంది కాని మానసికంగా చాలా బాధపడుతున్నది.

"ఇన్నాళ్ళనుంచీ లలిత పెళ్ళినిగురించి ఏమీ పట్టించుకోని మామయ్య, మా పెళ్ళినిగురించి మా అమ్మ యెప్పుడయినా కదలేసినప్పును, 'అప్పుడు ఏం తొందరః' అని నవ్విన మామయ్య, ఇప్పుడు లలిత పెళ్ళినిగురించి బెంగపెట్టుకున్నాడు. లలిత తన పెళ్ళిగురించిన వాళ్ళమాటలు విన్నది కామోసు! పొద్దున నాతో మీ విషయం వివరంగా చెప్పింది. మిగతా విషయాలెలా ఉన్నా మేమిద్దరము దాపరికంలేని మనుష్యులం. అన్నీ చెప్పి ఈ ఉత్తరం మీ కిచ్చిరమ్మని ఆమె

నన్ను కోరినద. అంతా విన్నతరవాత నన్ను వివాహం చేసుకొనవలసిందని లలితని అడగడానికి నేను పూనుకొనలేదు. మీ మీద ఆమెకు అచంచలమయిన విశ్వాసం ఉన్నట్లు నాకు అర్థమయింది. ఇంకా చెయ్యి జారిపోకమునుపే, అంతా చక్కబడితే బావుంటుందని ఆమె అనుకున్నది. అయితే మీ వద ఆమె యేదీ దాచదలచుకోలేదు ఉన్న విషయాన్ని విపులంగా వివరించి మీకు ఈ ఉత్తరం అందజేయమని ఆమెనన్ను కోరింది. ఆమెమీద నాకు జాలివేసింది. అందువల్ల ఆమెకోరికను నేను నిరాకరించలేకపోయాను" అంటూ అతను ఒక ఉత్తరం యిచ్చాడు ఉత్తరం క్లుప్తంగా ఉన్నది.

"ప్రియబంధూ! మా బావ ఆంజనేయులు మీకుఅన్నీ తెలియజేస్తాడు. మీరు అతనివెంట వచ్చి, నాన్నగారితో మన విషయం తెలియ చెయ్యండి. ఆంజనేయుల్ని నేను యెప్పుడూ వివాహం చేసుకోవాలని అనికొని వుండలేదు. ఆ ఆశలన్నీ మీరే. వస్తారుగా... ఇట్లు...

ఆ వుత్తరం చదువుతున్న సుబ్బారావుకు తల గిర్రున తిరుగినట్లనిపించింది. ఆంజనేయులు చెప్పిన విషయాలు నమ్మలేకపోతున్నాడు. నమ్మలేకుండా ఉండలేకనూపోయాడు.

లలిత సుందర స్వరూపం, మనోహర లావణ్యం అతనికి గుర్తుకువచ్చాయి. మరుక్షణం మశూచి మచ్చలతోఉన్న లలితమొహం వూహించుకున్న అతనికి అమితంగా బాధ కలిగింది. అటువంటి సంఘటననుగురించి ఆలోచించటానికిభయం వేసింది అతనికి.

తను హృదయపూర్వకంగా ప్రేమించిన బాలికకు అట్లా కావడం అతనికి విరక్తి కలిగించింది. ఇదంతా నిజమా, కలా అన్న ఆలోచనా కలిగింది. తల తిరిగిపోయినట్లుగా. ఆ వుత్తరాన్ని చేతితో పట్టుకుని కూర్చుని అయోమయంగా చూస్తున్న సుబ్బారావును చూస్తూ అలాగే ఉండిపోయాడు ఆంజనేయులు కాస్సేపు.

"అన్నట్టు మీకు చెప్పడం మరిచిపోయాను. రేపు తెల్లవారుఝామున మద్రాసు వెళ్ళిపోడానికి నిశ్చయం చేశారు అమ్మా, మామయ్యా. మీరు ఇప్పటికీ లలితని కోరుకుంటున్న పక్షంలో ఇప్పుడు నాతో వచ్చేసి మామయ్యతో చెప్పెయ్యండి. పోనీ, మీరు వూరికే వచ్చి కూర్చుంటే నే నేమిగతా వ్యవహారం చూస్తాను.

ఇందులో నా స్వార్థం యేమీ లేదు. పాపం లలితకి అసలే పెద్ద దెబ్బ తగిలింది. ఈ సమయంలో ఆమెపై చేతనయినంతవరకు జాలిచూపించి సహాయపడటమే నా ఉద్దేశ్యం. ఈ వార్త మీకూ పిడుగులాగ తగిలి ఉండవచ్చును. కానీ, వాస్తవం యిది. మీరు కాసేపు ఆలోచించుకోండి. అట్లా వెళ్ళివస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

అస్తవ్యస్తమైన ఆలోచనలతో సుబ్బారావు తల వేడెక్కిపోయింది. కాస్సేపయింతరవాత ఆంజనేయులు వచ్చాడు. "సుబ్బారావుగారూ! వస్తున్నారా?" అని అడిగాడు.

కాసేపు చూచి సమాధానం రాకపోవడంతో, "పోనీ, లలితకి యేమయినా వుత్తరం రాసి ఇస్తారా?" అని అడిగాను.

దానికీ జవాబివ్వ లేక అలాగే చూస్తూ ఉండిపోయాడు సుబ్బా
రావు. కాస్సేపుఆగి విసుగెత్తి, వెళ్ళిపోయాడు ఆంజనేయులు
చివరికి.

ఆంజనేయులు వెళ్ళిపోయేకకూడా చాలాసేపు అలా
ఆలోచిస్తూనే ఉండిపోయేడు సుబ్బారావు. ఆ రాత్రి అతనికి
తిండిలేదు. అల్లాగేచూస్తూ యే మూడు గంటలకో నిద్ర
పోయేడు.

ఆ మరునాడు ఆ యింట్లో సందడిలేదు. బావురుమంటు
న్నట్టు కనబడింది యిల్లు. ఆ తెల్లవారుఝామునే అంతాకలిసి
మదరాసు వెళ్ళిపోయేరని తెలిసింది తరవాత.

తను యేం చేసేడు? ఏమి కావాలని కోరుకున్నాడు?
ఏమయింది? — ఇవే అతని ఆలోచనలు. 'లలిత తనను
గురించి ఏమనుకుంటుంది! పాపం వెళ్ళిపోయేటప్పుడు ఎంతబాధ
పడిందో గదా? అంత అందమయిన అమ్మాయి ఆ విధంగా
అయిపోవటం తనకే ఇంక రంపపుకోతగా ఉందిగదా! ఇక ఆ
అమ్మాయి ఎట్టిబాధకు లోనయిందో గదా!

'ఇట్లాంటి స్థితిలో యెవరయినా కావాలనుకున్నవారి
దగ్గిరనుంచి సానుభూతిని సహాయాన్ని ఆపేక్షించటంలో
అసహాజత్వం యేమీలేదు. అయితే మూర్ఖతవల్ల తను ఏమీ
చూపలేకపోయాడు. తను ఎందుకూ పనికిరాడు.

'ఇన్నాళ్ళనుంచి ఆ అమ్మాయిలో కొత్తఆశల్ని ప్రేరే
పించి, కలల్లోవిహరింపజేసినవితను చేసిన పనులు. ఆమెకట్టుకున్న

ఆశల నిచ్చెనలు విధి క్రూర దృష్టిలో పడినవి. తను ఆ నిచ్చెన లను విరిచి పారేసి యేమీ యెరుగనట్టు ఉండిపోయేడు. తను చేసిన ద్రోహానికి ఆమె యెన్నివిధాల శపించిందో?' అంటూ బాధపడ్డాడు సుబ్బారావు. అంతావిని సత్యనారాయణ సుబ్బారావును ఓదార్చేడు.

మరో రెండు నెలలకు గాని మళ్ళీ సుబ్బారావు మామూలు ప్రపంచంలో పడలేదు. అయినా ఆ విషయం అంత త్వరగా మరిచిపోలేదు. ఆ యేడు అతను పరీక్ష తప్పేడు!

♦ ♦ ♦

బందరునుంచి బెజవాడవెళ్ళే రైలు గుడివాడ స్టేష నులో ఆగింది. థర్డుక్లాసు కంపార్టుమెంటులో మూలను సామా నులమధ్య కూర్చుని పుస్తకం చదువుకుంటూన్న సుబ్బా రావు, ఏమండోయ్! నాలుగోవాడు ఇందాకటినుంచి ఏడుస్తు న్నాడు. ఏమయినా పట్టుకురండి" అన్న శ్రీమతి పురమాయిం పును శిరసావహించినవాడై ప్లాటుఫారంమీాదికి వచ్చాడు.

ఈ పదేళ్ళలోనూ సుబ్బారావులో చాలా మార్పు కనబడుతూంది. మనిషి పలచబడ్డాడు. బుగ్గలు లోపలికితోసు కుని పోయేయి. తలమీాద వెంట్రుకలు పచ్చబడ్డాయి.

ఫలహారశాల వద్ద పిల్లలకు పళ్ళూ, బిస్కట్లూ తీసు కుంటూన్న సుబ్బారావుకు దూరంగా పెయింటింగురూము ముందు బెంచీమీాద కూర్చున్న స్త్రీని ఎక్కడో చూసినట్లు అనిపించింది. ఆమె ఎటో చూస్తున్నది.

మళ్ళీ మళ్ళీ చూశాడు ఆమెవైపు. మనస్సు యేదో బాధతో మూలిగింది. అంతరాంతరాలలో యేవో జ్ఞాపకాల తెరలు లీలగా కదిలాయి. కాని ఆ పొరలు అతను యెంత ప్రయత్నించినా విడివడలేదు. విసుగువచ్చి ఆ ప్రయత్నం మాని నడిచాడు ఇవతలికి.

బరువుగా చెయ్యి తన భుజంమీద పడేసరికి పక్కకు తిరిగి చూసిన సుబ్బారావుకు, నవ్వుతూ "నేను గుర్తున్నానాండి?" అని పలకరిస్తూన్న ఆంజనేయులు కనిపించాడు. ఇంకో పదేళ్ళ తరవాతయినా అతన్ని తను గుర్తు పట్టగలడు. అతని అవతారం అట్టిది. "భీమవరంలో మా మేనల్లుడి పెళ్ళి. మా వాళ్ళతో కలిసి వెడుతున్నాను" అని చెప్పేడు. తన ఆరోగ్యం, ఉద్యోగంల అభివృద్ధి మొదలయిన విషయాల్ని గురించి కబుర్లు చెప్పేడు ఆజనేయులు వసపోసినట్టు.

ఇప్పుడు తెలిసింది సుబ్బారావుకు ఇందాక ఫలహారశాలవద్ద చూసి తను జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నించిన స్త్రీ యెవరో.

సుబ్బారావులో పాత జ్ఞాపకాలు మెదిలేయి. ఆంజనేయులకు చెవులు అప్పజెప్పి ఆ జ్ఞాపకాలనే నెమరువేస్తూ నిలుచున్నాడు. అతనిలో అనేక ప్రశ్నలు బయలుదేరాయి. ఎన్నో ప్రశ్నలు అడగాలనిపించింది. నోరువిప్పి ఒక్క ప్రశ్నా అడగలేకపోయేడు. ఇప్పుడూ అతని చేతగానితనమే అతనికి అడ్డువచ్చింది.

గార్డు విజిలువేశాడు. పచ్చజండా ఎగురుతూంది. తను వెళ్ళిపోవాలి.

ఇక ఆగలేకపోయాడు సుబ్బారావు. "లలిత ఎట్లా ఉంది?" అని అడగలేక అడగలేక అడిగేడు ఆంజనేయుల్ని.

ఆంజనేయులు పకపకా నవ్వేడు. "ఎవరూ మీ లలిత సంగతేనా? పాపం! ఇంకెక్కడి లలితండీ! ఆ లలిత చచ్చిపోయింది. అప్పుడే, పాపం పోతూపోతూ మిమ్మల్ని గురించి పలవరిస్తూ, ఇంకా యెందుకులెండి ఆ సంగతులు?

అన్నట్టు, మావాళ్ళని చూడలేదు గదూ మీరు. అదుగో వస్తున్నది, మీరు చూద్దురుగాని వెయిటింగ్ రూము వద్ద కూర్చుని కూర్చుని విసుగువచ్చిందికాబోలు ఆవిడగారికి" చెప్పుకుపోతున్నాడు ఆంజనేయులు.

కళ్ళవెంట నీరు జలజలా కారుతూండగా మొహం పక్కకుతిప్పి కళ్ళు తుడుచుకున్నాడు సుబ్బారావు.

రైలు బయలుదేఁబోతున్నట్టు కూతవేసింది. కాసేపటికి నోరు పెగుల్చుకుని "అవును, ఆంజనేయులుగారూ! నా లలితని నేనే చేతులారా చంపివేసేను. నేనే ఆమె అందమైన ఆశలను క్రూరంగా హింసించి హత్యచేసేను. అయితే నేను కావాలనిమాత్రం అలా చెయ్యలేదు. నా మాట నమ్మండి.

నా లలిత చావలేదు. హత్యచెయ్యబడింది. అందుకుగాను నాకు మీరు ఇప్పుడు విధిస్తున్న శిక్ష యెంతమాత్రము సరిపోదు. నిజంగా, నా లలిత ఇక లేదు" అన్నాడు సుబ్బారావు.

రైలు కదిలింది. ఆంజనేయులుతో వసానయినా చెప్పకుండా, కన్నీరు తుడుచుకుంటూ పరుగెత్తుకొని వెళ్ళి

పెట్టె యెక్కిన సుబ్బారావు, అప్పుడే అక్కడికి వచ్చిన ఆ మనిషి తనను వెనకాలనుంచి దయతోనూ, ఆర్ద్రితతోనూ చూడటం గమనించలేదు.

కాస్సేపయినతరవాత_బుగ్గనవేలుపెట్టుకొని ఎర్రబడిన కళ్ళతో, ఆలోచిస్తూ కూర్చున్న సుబ్బారావును, "ఏమండోయ్, బుజ్జి చూడండీ, మిమ్మల్ని చూసి చేతులెట్లా చాచుతోందో!" అన్న మాటలతో ఈ ప్రపంచంలోనికి లాగుకొని వచ్చింది ధర్మపత్ని.